

తపాలా సేవలపై అయోమయం
ఆధునిక సాంకేతిక సమాచార వ్యవస్థను అందిపుచ్చుకుంటూ సరికొత్త ప్రయోగాలుచేస్తున్న పోస్టల్‌శాఖ పాతసేవలను ఒకొక్కటిగా రద్దుచేస్తూ వస్తోంది. -8లో



నాందేడ్‌-ధర్మవరం రైలు రద్దు
తెలంగాణాలో వర్షాల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. అందులో నాందేడ్‌-ధర్మవరం రైలును ఈనెల 29, 30 తేదీల్లో రద్దుచేసినట్లు అధికారులు తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.270
రెండోరకం	రూ.150	రూ.210



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 73 మెట్రిక్‌ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	564	670
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 284.460 కిలోలు

న్యూస్‌రీల్‌

నూతన బార్లకు నేడు డ్రా
రాయచోటి టౌన్‌: జిల్లా కలెక్టరేట్‌లో బార్లకు ఈనెల 30న డ్రా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్‌, ఎక్సైజ్‌ శాఖ అధికారి మధుసూదన్‌ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 ఓపెన్‌ బార్లకు గాను మదనపల్లెలో మూడు, రాయచోటిలో రెండు, రాజంపేటలో రెండు బార్లకు కావాల్సిన దరఖాస్తులు వచ్చాయన్నారు. పీలేరులో ఒకటి ఉండగా దరఖాస్తు రాలేదు. కల్లుగీత కార్మికులకు కేటాయించిన బార్లకు కూడా దరఖాస్తు వచ్చినట్లు ఆయన తెలిపారు. వీటికి సంబంధించి ఓపెన్‌ లాటరీ డ్రా శనివారం ఉదయం 8 గంటలకు తీయనున్నట్లు తెలిపారు.

నియామకం

దండు గోపి

రాజంపేట: వైఎస్సార్‌ సీపీ ఎస్సీసెల్‌ రాష్ట్ర కార్యదర్శిగా దండుగోపి నియమితులయ్యారు. ఈమేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. దండుగోపి ఇదివరకు డీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌గా పనిచేశారు. తనకు పదవి రావడానికి సహకరించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


అంజనప్ప

చిన్నమండెం: వైఎస్సార్‌ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా చిన్నమండెం మండలానికి చెందిన చుక్క అంజనప్పను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఎంపీ మిథున్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దేవనాథరెడ్డి, మండల అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

'దేశ భాషలందు తెలుగు లెస్స'

గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి జగదాంబ సెంటర్‌: దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీ కృష్ణదేవరాయలు కీర్తించిన భాష మనదని వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఇటాలియన్‌ ఆఫ్‌ ది ఈస్ట్‌గా తెలుగుభాష కీర్తి పొందిందన్నారు. దేశంలో 22 అధికారిక గుర్తింపు కలిగిన భాషల్లో ఒకటిగా తెలుగు భాష వెలుగొందుతోందన్నారు.గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు రామమూర్తి అని, ఆయన జయంతి నాడు తెలుగు భాషా దినోత్సవం జరుపుకోవడం గర్వకారణమన్నారు. తెలుగుభాష అభివృద్ధికి గత జగన్‌ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ శ్రీకాంత్‌రెడ్డి తెలుగుభాష దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

సీఎం సభకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ శ్రీధర్‌ తదితరులు

రాజంపేట: సీఎం చంద్రబాబునాయుడు రాజంపేట మండలం బోయినపల్లిలో సెప్టెంబర్‌ ఒకటో తేదీన పర్యటించనున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ శ్రీధర్‌ చామకూరి శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ సభలో సీఎం ప్రసంగించనున్నారు. ప్రజావేదిక,హెలిప్యాడ్‌ స్థలాన్ని జిల్లా కలెక్టర్‌ పరిశీలించారు.కార్యక్రమంలో డివిజన్‌ రెవెన్యూ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన

అభ్యర్థుల పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్‌: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ముగిసింది. కడప బాలాజీనగర్‌లోని ఎస్వీ ఇంజినీరింగ్‌ కళాశాలలో డీఈఓ షేక్‌ షంషుద్దీన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం రెండవ రోజు ప్రశాంతంగా ముగిసింది. ఇందులో భాగంగా స్కూల్‌ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్‌ టీచర్స్‌, మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్స్‌తోపాటు పలు రకాల ఉపాధ్యాయ పోస్టులకు మొదటిరోజు 712 మంది అభ్యర్థులకు గాను 609 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండవ రోజు మిగిలిన 103 మందితోపాటు స్టేట్‌, జోన్‌కు సంబంధించి 535 మంది అభ్యర్థులు వచ్చారు.

శోభాయమానం.. నిమజ్జనోత్సవం

అశేష భక్తజనం జేజేలు పలకగా.. భక్తి పారవశ్యంతో బైబైలు చెప్పగా.. కన్నుల పండువగా శోభాయాత్ర సాగగా.. దారి పొడవునా 'గణపతి బప్పా మోరియా' నినాదాలు మారుమోగగా.. ఊరు వాడా జన సాగరమై కదిలిరాగా.. నదుల తీరం.. భక్తజన హారంలా మారిన వేళ.. గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. నిమజ్జనోత్సవం వెల్లివిరిసింది. యువత ఉత్సాహం వెల్లువెత్తింది. ఆబాల గోపాలం ఆనందంతో తన్మయత్వమైంది.

- గణనాథునికి ఘనంగా వీడ్కోలు
- కమనీయంగా శోభాయాత్ర
- వెల్లువెత్తిన నిమజ్జనోత్సాహం
- భక్తజన సంద్రంగా నదుల తీరం
- మార్మోగిన జై గణేశా నినాదాలు


సిద్దవటంలోని గాంధీవీధిలో గణనాథుని ఊరేగింపులో కళాకారుల కోలాట ప్రదర్శన


సిద్దవటం: పెన్నానదిలో వినాయకుడి నిమజ్జనం


దేవునికడప చెరువులో గంగమ్మ ఒడికి గణనాథుడు

రాయచోటి/కడప సెవెన్‌రోడ్స్‌: బొజ్జ గణపతిని మూడు రోజులపాటు పూజించిన అనంతరం శుక్రవారం అన్నమయ్య, వైఎస్సార్‌ కడప జిల్లాలోని పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. వైఎస్సార్‌ జిల్లాలో ఎప్పటి కంటే ఈ ఏడాది 10 శాతం ఎక్కువ విగ్రహాలను పందిళ్లలో ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన గణేష్‌ ఉత్సవ్‌.నెట్‌ వెబ్‌సైట్‌ ద్వారా సింగిల్‌ విండో విధానంలో 4500 విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. క్యూఆర్‌ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాలు జారీ చేసింది. శుక్రవారం కడప జిల్లాలో సుమారు 1600 విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. జైబోలో గణేష్‌ మహరాజ్‌కీ.. గణపతి బొప్పమోరియా నినాదాలు.. తప్పెట్లు, చెక్కభజనలు, బ్యాండుమేళాలు, భక్తి గీతాలాపనలు, యువకుల ఈలలు, కేరింతలు, ఉత్సాహాల మధ్య శోభాయాత్ర ఉత్సాహంగా జరిగింది. పలు చోట్ల గణపతి చేతిలో పూజలందుకున్న లడ్డూల వేలం పాటలు, ఉట్టికొట్టడం, మహిళలకు ముగ్గుల పోటీలు, బాలలకు వివిధ రకాల పోటీలను ఏర్పాటు చేసి బహుమతులు ఇవ్వడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సహకారంతో వినాయక మండపాల నిర్వాహకులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ట్రాక్టర్లు, లారీలు, మినీ క్యారేజ్‌ లారీలు, ఎడ్లబండ్లలో గణనాథులను ఊరేగింపు నిర్వహించారు. యువకులు, బాలలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ మేళతాళాలు డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేసుకుంటూ విగ్రహం వెంట నిమజ్జనానికి వెళ్లారు. ఉత్సవాల్లో ఐదవ రోజైన ఆదివారం విగ్రహాల నిమజ్జనం జరగనున్నట్లు పోలీసువర్గాల ద్వారా తెలుస్తోంది. వినాయక నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు పోలీసు శాఖ అనేక చర్యలు చేపట్టింది.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవం.. లంబోదరుడి కల్యాణం
పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీలోని వినాయక స్వామి ఆలయంలో గణనాథుడి కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం జరిగింది. గ్రామానికి చెందిన గద్దం రామకృష్ణారెడ్డి, శకుంతల దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. డి వెంకటసుబ్బారెడ్డి,సులోచన దంపతులు, కుటుంబ సభ్యులు మధ్యాహ్నం రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


హాజరైన భక్తులు

వైభవంగా ఆరోగ్యమాత ఉత్సవాలు ప్రారంభం

కడప సెవెన్‌రోడ్స్‌: కడప నగరం రైల్వేస్టేషన్‌ రోడ్డులోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో తిరునాల మహోత్సవాలు శుక్రవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. బిషప్‌ సగినాల పాల్‌ ప్రకాశ్‌ పతాకాన్ని ఎగురవేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం శాంతి కోసం పావురాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా బిషప్‌ దివ్యబలిపూజ సమర్పించి మాట్లాడారు.

తిరునాల ఉత్సవాలు ఘనంగా, సవ్యంగా సాగాలని కోరారు. ప్రజలంతా శాంతి సమాధానాలతో ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. దేవుడు ప్రజలు ప్రార్థనలు ఆలకించి వారి అభీష్టాలను నెరవేర్చాలని కోరుకుంటున్నామన్నారు. నవదిన జపాలలో తొమ్మిది రోజులు ప్రజలు వేలాదిగా పాల్గొని ఆ దేవుని ఆశీస్సులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్‌ ఫాదర్‌ ఎండీ ప్రసాద్‌రావుతోపాటు ఫాదర్‌ ఎ.జోసెఫ్‌రాజు, డీన్‌ రెవరెండ్‌ ఫాదర్‌ ఎస్‌.సురేష్‌, విచారణ ప్రెసిడెంట్‌ విక్టర్‌, కార్యదర్శి సెబాస్టియన్‌, ఆర్థిక కార్యదర్శి జి.ఆనంద రావు, డయాసిస్‌ గురువులు, ఆరోగ్యమాత, జేయంజె, క్రీస్తు జ్యోతి సిస్టర్స్‌, తిరునాల కమిటీ పెద్దలు, యువత, పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.


పతాకం ఎగురవేసి ఉత్సవాలు ప్రారంభిస్తున్న బిషప్‌ సగినాల పాల్‌ ప్రకాశ్‌

రాయచోటిలో సెప్టెంబర్‌ 4న 5-కే రన్‌

రాయచోటి: సెప్టెంబర్‌ 4వ తేదీన 5కె రెడ్‌ రన్‌ మారథాన్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కె లక్ష్మీ నరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం యూత్‌ ఫెస్ట్‌–2025లో భాగంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌, ఎస్టీఐపై అవగాహన కోసం యువతకు మారథాన్‌ నిర్వహించే విషయంపై రాయచోటిలోని డీఎంహెచ్‌ఓ ఛాంబర్‌లో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ, అడిషనల్‌ డీఎంహెచ్‌ఓ రమేష్‌ బాబులు కార్యక్రమం నిర్వహణపై అధికారులు, సిబ్బందితో చర్చించారు. 4వ తేదీ ఉదయం 5.30 గంటలకు స్థానిక గవర్నమెంట్‌ డిగ్రీ కళాశాల (బాలుర) నుంచి నారాయణ రెడ్డిపల్లి వరకు 5కె రన్‌ ఉంటుందన్నారు. పరుగు పోటీలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న 17 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల వారు పాల్గొనవచ్చన్నారు. పోటీలలో గెలుపొందిన పురుషులకు, మహిళలకు, ట్రాన్స్‌ జెండర్‌లకు వేర్వేరుగా మొదటి బహుమతిగా రూ. 10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 7 వేలు ఇవ్వనున్నట్లు అడిషనల్‌ డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీలలో కూడా పాల్గొనవచ్చన్నారు. జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్‌) అధికారి ఎం రామ్మోహన్‌ రెడ్డి, గుర్రప్ప, జిల్లా క్రీడా శాఖాధికారి మస్తాన్‌, గౌస్‌ బాష, జిల్లా నెహ్రూ యువకేంద్రం మై భారత్‌ ప్రతినిధి వెంకటేశ్వర్లు, ఇంటర్‌ విద్యాశాఖ డీఐఈఓ రవి, జిల్లా రెడ్‌ రిబ్బన్‌ క్లబ్‌ కో–ఆర్డినేటర్‌ వెంకటరావు, విశ్వ ప్రసాద్‌, క్లస్టర్‌, ప్రోగ్రామ్‌ మేనేజర్‌ వి భాస్కర్‌, క్రీడాశాఖ కోచ్‌ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య

కమనీయం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహాస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్వాతి నక్షత్రంతో పాటు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో వేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు జరిపారు. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు. కార్యక్రమంలో అర్చకులు కృష్ణరాజ బట్టార్‌, రాజుస్వామి, గోకుల్‌ స్వాములు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

రాయచోటి: జర్నలిస్టుల అక్రిడిటేషన్‌ కార్డుల గడవు మరో మూడు నెలలపాటు పొడిగిస్తూ సమాచార, పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 31వ తేదీ వరకు అక్రిడిటేషన్‌ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు నవంబరు 30వ తేదీ వరకు పొడిగించారు. ఈలోపు కొత్త అక్రిడిటేషన్లు జారీ చేస్తే అప్పటి వరకే ఇవి చెల్లుబాటులో ఉంటాయి. ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లంబో'ధర' లడ్డూ

మైదుకూరు: లంబోదరుడి లడ్డూ ప్రసాదానికి యమ డిమాండ్‌ ఉంది. రూ.లక్షల్లో ధర పలుకుతోంది. వినాయక చవితి ఉత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం భారీగా వేలం పాటలు నిర్వహించారు. పలువురు భక్తులు పోటీ పడి దక్కించుకున్నారు. అలాగే పూజ సామగ్రిని పొందేందుకు అమితాసక్తి కనబరిచారు. స్వామి వారి ప్రసాదం, పూజ సామగ్రి అందడం తమ అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. మండపం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులకు పంపిణీ చేశారు. వైఎస్‌ఆర్‌, అన్నమయ్య జిల్లాలో ఈ పరిస్థితి కనిపించడం విశేషం.

- మైదుకూరు మండలంలోని అన్నలూరు అరవిందనగర్‌లో అదే గ్రామానికి చెందిన కల్లూరి రామిరెడ్డి 10 కిలోల లడ్డూను రూ.4 లక్షలకు సొంతం చేసుకున్నారు. తోట వెంకటరామిరెడ్డి 15 గ్రాముల వెండి కాయిన్‌ను రూ.1.20 లక్షలకు పొందారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో కొండిశెట్టి బాలుడు రూ.14 వేలకు చెరకు గడలను కైవసం చేసుకున్నారు. మైదుకూరులోని శీలం నగర్‌లో లడ్డూ ప్రసాదాన్ని మున్సిపల్‌ చైర్మన్‌ మాచనూరు చంద్ర, ఆయన కుమారుడు సాగర్‌ రూ.2.16 లక్షలకు దక్కించుకున్నారు.



లడ్డు ప్రసాదంతో కల్లూరి రామిరెడ్డి

దోస..రైతుకు గోస




ఈయన పేరు తాటిగుట్ల ధర్మారెడ్డి. వీరబల్లి మండలం, ఓదివీడు గ్రామం. పది ఎకరాల్లో దోపంట సాగు చేశాడు. ఇందుకోసం రూ. 12 లక్షలు పెట్టుబడి పెట్టాడు. తోటనిండా కాయలు కనిపించడంతో మంచి ఆదాయం వస్తుందని ఆశించాడు. వ్యాపారుల సిండికేట్‌ వల్ల ధరలు పలకలేదు. వారం నుంచి ధరలు అనుకూలిస్తున్నా దిగుబడుల సమయంలో పంట దెబ్బతిన్నట్టు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీంతో దోసపంటను పొలంలోనే వదిలేశాడు.

- దిగుబడి ఉన్నప్పుడు ధరలేదు.. , ధర ఉన్నా దిగుబడి లేదు
- ఊజీ ఈగతో పొలంలోనే కుళ్లిపోతున్న కాయలు
- జిల్లాలో రూ. 50 కోట్ల నష్టం


ఊజీ వైరస్‌ కారణంగా కాయలను తోటల్లోనే వదిలేసిన రైతులు

రాయచోటి: జిల్లాలో దోససాగు చేసిన రైతు కష్టాలు, నష్టాలు అన్నీ ఇన్నీ కావు. వ్యయ ప్రయాసాలకోర్చి పండించిన పంటకు మార్కెట్‌లో నిలకడలేని ధరలు, దళారుల మోసాలు, ఊజీఈగ వైరస్‌ దాడులతో దోస రైతుకు పెట్టుబడులు కూడా దక్కక అప్పులపాలవుతున్నారు. జిల్లాలో దాదాపు మూడువేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో వివిధ రకాల దోస పంటను రైతులు సాగు చేశారు. కొనేవారు లేకపోవడంతో పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారు.

- దోసపంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధర పతనం కావడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోయారు. ధరలు, మార్కెట్‌ మాయాజాలంతో ఓవైపు నష్టపోతుంటే మరోవైపు కల్తీ విత్తనాలు మరింత కుంగదీస్తున్నాయి. వారం కిందటి వరకు టన్ను రూ. 4 వేలు నుంచి రూ. 5 వేల లోపు పలికింది. ప్రస్తుతం వర్షాలు కురవడం, ఊజీ వైరస్‌ వ్యాప్తితో కాయలు దెబ్బతిన్నాయి. సాధారణంగా ఎకరా పొలంలో దోస సాగు చేస్తే పది నుంచి 12 టన్నులు దిగుబడి వస్తుంది. ఒక్కో ఎకరాకు లక్ష రూపాయలు వరకు పెట్టుబడి వస్తుంది. గత ఏడాది టన్ను దోస ధర రూ. 20 వేలు పలికింది. దీంతో ఎకరాకు రూ. 2 లక్షల వరకు మిగిలే అవకాశం ఉంది. ఈ క్రమంలో గత ఏడాది ధరే ఈ సారి కూడా ఉంటుందని జిల్లాలో విస్తారంగా ఢిల్లీ, బాబీ తదితర రకాల దోసను సాగు చేశారు. అయితే దిగుబడి వచ్చే సమయానికి దళారుల సిండికేట్‌ కారణంగా కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రాలేదు. మార్కెట్లకు తసుకెళ్లినా కొనేవారు ఉండరన్న అనుమానంతో పంటను కోయకుండానే వదిలేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా రూ. 50 కోట్లకుపైగా దోస సాగు చేసిన రైతులు నష్టపోయినట్లు హార్టికల్చర్‌ అధికారుల ద్వారా తెలుస్తోంది.



- దోసపంట మార్కెట్‌లో ప్రస్తుతం టన్ను రూ. 20 వేలు వరకు పలుకుతుంది. ధరలు అనుకూలిస్తున్నా తెగుళ్లు, ఊజీ ఈగల దాడులతో కాయలు పొలంలోనే కుళ్లిపోతున్నాయి. గత ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా మంచి ధర పలుకుతుందన్న ఆశతో సాగు చేస్తే నిరాశే మిగిలిందని రైతులు వాపోతున్నారు.

క్లుప్తంగా

పోలీస్ సిబ్బందిపై దాడిచేసిన నిందితుడికి రిమాండ్

నిమ్మనపల్లె : పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ, పోలీస్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి, అసభ్యపద జాలంతో దూషించి దాడికి యత్నించిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు శుక్రవారం ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లె దాసరిపేటలో వినాయకమండపం వద్ద అసభ్య నృత్యాలను ప్రదర్శించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ నిర్వాహకులను గురువారం మధ్యాహ్నం స్టేషన్‌కు పిలిపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వాహకులతో పాటు స్టేషన్‌కు వచ్చిన దాసరిపేటకు చెందిన తుపాకుల రోహిత్‌కుమార్(30) పోలీసులతో వాగ్వివాదానికి దిగి దురుసుగా ప్రవర్తించి పరుష పదజాలంతో దూషించి పోలీస్‌సిబ్బందిపై దాడికి యత్నించాడు. ఈ ఘటనపై సెంట్రీ పోలీస్ కానిస్టేబుల్ హరి ఇచ్చిన ప్రత్యేక నివేదిక ఆధారంగా పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆరుగురి మృతికి కారకుడైన డ్రైవర్‌కు జైలు శిక్ష


నిందితుడు మహదేవ

ఓబులవారిపల్లె : జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సును సిమెంట్ ట్యాంకర్ ఢీ కొనడంతో ఆరుగురు మృతికి కారణమైన డ్రైవర్ మహదేవకు నాలుగున్నర సంవత్సరాలు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ పి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన మహదేవ మద్యం సేవించి సిమెంట్ ట్యాంకర్‌ను అతివేగంగా నడిపి చిన్నఓరంపాడు సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీ కొన్నాడు. ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా 29 మందికి గాయాలయ్యాయి. 56 మంది సాక్షులను విచారించి రాజంపేట మూడవ అదనపు జడ్జి ఎస్ ప్రవీణ్ కుమార్ నిందితుడికి నాలుగున్నర సంవత్సరాలు జైలు శిక్ష విధించారని తెలిపారు.

అదుపు తప్పిన కారు

– కాపాడిన 108 సిబ్బంది


గాయపడిని వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలో గురువారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి రామతీర్థం వద్ద చెరువుకట్టపై ప్రమాదానికి గురైంది. చెన్నై నుంచి కడపకు వెళ్తున్న కారు కట్టక్రింద ఉన్న రామతీర్థం వైపునకు దూసుకెళ్లింది. ప్రమాదం అర్ధరాత్రి జరగడంతో కారులోని ప్రయాణికులు 108 నెంబర్‌కు లైవ్ లొకేషన్ పంపించి సమస్యను తెలిపారు. దీంతో సమాచారం అందుకున్న సిబ్బంది టెక్నీషియన్ నాగబాబు, పైలెట్ విజయ్ కుమార్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని రోప్ సహాయంతో ప్రమాదానికి గురైన కారులోని ప్రయాణికులు శ్రీనివాసకుమార్, లాస్యను కాపాడారు.

తపాలా సేవలపై అయోమయం..!

- ఇప్పటికే రిజిస్టర్డ్ పోస్టల్ సేవల నిలిపివేత నిర్ణయం
- తాజాగా లెటర్‌రెడ్(పోస్ట్)బాక్స్ ఎత్తివేత ప్రచారం
- అవి ఊహాగానాలే అంటున్న తపాలా వర్గాలు
- ఈ–సేవ విస్తరణలో పోస్టల్‌శాఖ నిమగ్నం



రాజంపేట : ఆధునిక సాంకేతిక సమాచార వ్యవస్థను అందిపుచ్చుకుంటూ ఈ–సేవల విస్తరణ కోసం సరికొత్త ప్రయోగాలుచేస్తున్న పోస్టల్‌శాఖ పాతసేవలను మాత్రం ఒకొక్కటిగా రద్దుచేస్తూ వస్తోంది. ఇప్పటికే పలు సేవలు రద్దుకాగా, సెప్టెంబరు 1 నుంచి రిజిస్టర్ పోస్ట్‌సేవలు నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. మరో వైపు లెటర్ రెడ్ (పోస్టల్)బాక్స్‌లను కూడా ఎత్తివేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రధానంగా పోస్టల్ శాఖ నూతన ఒరవడితో ఈ–సేవల విస్తరణపై దృష్టి సారించినట్లుగా కనిపిస్తోంది. మొబైల్‌ఫోన్లు, ఇంటర్నెట్ సేవలు లేని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఏకైక దిక్కు తపాలానే...అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు మరింత సులువైన సేవలందించేందుకు సాంకేతిక టెక్నాలజీకి పోస్టల్ డిపార్టుమెంట్ అప్‌గ్రేడ్ అవుతోంది.

రిజిస్టర్డ్ పోస్టుకు మంగళం

పోస్టల్‌శాఖ రిజిస్టర్ పోస్టు సేవలకు మంగళం పాడనున్నది. తాజాగా బ్రిటిషు కాలం నుంచి వస్తున్న రిజిస్టర్డ్ పోస్ట్‌సేవలు సెపెంబరు1 నుంచి నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే పోస్టుమాస్టర్లకు శాఖపరమైన నోటీసులు జారీచేసింది. ఒకప్పుడు బంధుమిత్రులకు కబురు పంపాలన్న..ముఖ్యమైన పత్రాలు చేరవేయలన్నా పోస్ట్‌కార్డు లేదా రిజిస్టర్డ్ మాత్రమే అందుబాటులో ఉండేది.

సుమారు 17యేళ్లుగా..

పోస్టల్ వ్యవస్థ ప్రజల జీవితంలో విడదీయరాని భాగమైంది. కాలంతో పాటు మారిన పోస్టల్ డిపార్టుమెంట్ ఇప్పుడు మరింత ఆధునికసేవలతో ముందుకు వస్తోంది. 1854లో అప్పటి బ్రిటిషర్ లార్డ్‌డల్హౌసీ ప్రవేశపెట్టిన ఇండియా పోస్ట్ ఆఫీస్ చట్టంతో సేవలు ప్రారంభమైయ్యాయి. అంతకముందుగా 1766లో వారెన్ హేస్టింగ్స్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో కంపెనీ మెయిల్ మొదలైంది. దాదాపు 171యేళ్లుగా ముఖ్యమైన పత్రాలను, వస్తువులను సురక్షితంగా, నమ్మకంగా పంపించడానికి రిజిస్టర్డ్ పోస్ట్ ప్రధాన మార్గంగా నిలిచింది. లీగల్‌నోటీసులు,అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్ సంబంధిత పత్రాలు వంటి వాటిని పంపడానికి ఎంతగానో ఉపయోగపడింది. పంపిన వస్తువు అవతలివారికి చేరినట్లు రసీదు(డెలవరీ ప్రూఫ్) పొందడం ఒక ప్రత్యేకత, చట్టపరంగాను ఎంతో విలువైంది. ఇది కాస్తా మరో రెండు వారాల్లో కనుమరుగు కానున్నది.

స్పీడ్‌పోస్ట్‌లో విలీనం

రిజిస్టర్డ్ పోస్టు సేవను పూర్తిగా స్పీడ్‌పోస్ట్ సేవలో విలీనం చేస్తున్నట్లు తపాలాశాఖ ప్రకటించింది.తపాలాశాఖ తమ సేవలను ఆధునీకరించే ప్రయత్నంలో భాగంగా దేశీయ పోస్టల్ సేవలు క్రమబద్ధీకరణ, పనితీరు మెరుగుపరచడం, ట్రాకింగ్ వ్యవస్థను ఐలోపేతం తదితర ప్రక్రియలో భాగంగానే స్పీడ్‌పోస్ట్‌లో రిజిస్టర్డ్ పోస్ట్‌ను విలీనం చేస్తున్నట్లు వెల్లడించింది. స్పీడ్‌పోస్టు అంటే వేగవంతమైన డెలవరీ, ఇప్పుడు రిజిస్టర్డ్ పోస్టు సేవలు స్పీడ్‌పోస్ట్‌లో కలపడంతోడెలవరీలుమరింత వేగవంతం కానుంది. స్పీడ్ పోస్టు ద్వారా పార్శిల్ ఎక్కడి వరకు చేరిందో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఇది రిజిస్టర్డ్ పోస్ట్ లేదు. ఒక సేవ ఉండటం వల్ల పోస్టల్ శాఖ పని మరింత సులభమవతుందని అధికారులు పేర్గొంటున్నారు.

తగ్గిన ఆదరణ.. పెరిగిన సాంకేతికత

వాస్తవంగా రిజిస్టర్డ్ పోస్ట్ వాడకం గణనీయంగా తగ్గింది. వాట్సాప్, జీమెయిల్ వంటి డిజిటల్ మాధ్యమాల రాకతో సమాచార మార్పిడి వేగవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఇప్పుడు డిజిటల్ మార్గంలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతోంది. ఐదేళ్ల జరిగిన రిజిస్టర్డ్ పోస్ట్ బుకింగ్ పరిశీలిస్తే 25శాతం పడిపోయింది. స్పీడ్‌పోస్టు, ఇతర కొరియర్‌సేవలు అందుబాటులోకి రావడంతో రిజిస్టర్డ్ పోస్ట్‌కు డిమాండ్ తగ్గింది. అయితే తాజాగా స్పీడ్‌పోస్టుతో చార్జీల మోత తప్పని పరిస్థితి కనిపిస్తోంది.రిజిస్టర్డ్ పోస్ట్ కనీసం చార్జి రూ.26 నుంచి రూ.30 వరకు ఉంటుంది. స్పీడ్‌పోస్ట్ కనీస చార్జి రూ.41 ఇది రిజిస్టర్డ్ పోస్ట్‌తో పోలిస్తే 20 నుంచి 25 శాతం ఎక్కువ. ఇక చార్జీల భారం భరించకతప్పదు.

రెడ్‌పోస్టు బాక్స్‌పై ఊహాగానమే..

రిజిస్టర్డ్ పోస్ట్ సేవల రద్దు నేపథ్యంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన రెడ్‌పోస్టుబాక్స్‌లు ఎత్తివేత ప్రచారం జోరుగా సాగుతోంది. సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. దీంతో పోస్టల్ అభిమానులు కలత చెందుతున్నారు. దశాబ్దాలుగా నిస్వార్థంగా నిశ్శబ్దంగా నిశ్చలంగా విశ్వసనీయంగా సేవలు అందించిన భావోద్వేగాల నేస్తం ఇక కనిపించిందన్న బాధ వ్యక్తమౌవుతోంది. అయితే ఇందులో ఎలాంటి వాస్తవంలేదని , అది ఒక ఊహాగానమేనని మాత్రమే అని పోస్టల్ వర్గాలు అంటున్నాయి. పోస్టల్‌శాఖ ద్వారా ఎరుపు పోస్ట్‌బాక్స్‌లను ఎత్తివేస్తున్నట్లు అధికారిక ప్రకటన ఏదీ లేదని స్పష్టం చేస్తున్నారు.

కడప పోస్టల్ సూపరింటెండెంట్ ఏమంటున్నారంటే..

పోస్టుబాక్స్‌లు ఉండవనే సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న ప్రచారంపై కడప పోస్టల్ ఎస్పీ రాజేష్‌ని 'సాక్షి' వివరణ కోరింది. ఇప్పటి వరకు పోస్టుబాక్స్‌లు తొలిగింపునకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు రాలేదని ఎస్పీ స్పష్టం చేశారు.

ఆర్టీసీ బస్సు బైక్ ఢీ

– రైతు మృతి

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె మండలం కోటకొండ వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ రైతు మృతి చెందాడు. రెడ్డికోట పంచాయతీ కొప్పలవారిపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులురెడ్డి (50) ద్విచక్రవాహనంలో కోటకొండకు వెళ్తుండగా కోటకొండవద్ద మలుపులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీనివాసులురెడ్డి తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్వరరెడ్డి తెలిపారు.

నీటి కుంటలో పడి యువకుడు మృతి

కలికిరి : ప్రమాదవశాత్తూ నీటికుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం కలికిరి పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని బీడీ కాలనికి చెందిన కాగితి నరేష్(40) శుక్రవారం బహిర్భూమికని వెళ్లి కలికిరి–కలకడ రోడ్డు అంకాలమ్మ ఆలయం సమీపంలోని ఉమ్మనగుంటవద్దకెళ్ళాడు. అక్కడ ప్రమాదవశాత్తూ కాలుజారి కుటంలో పడి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మహబూబ్ బాషా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు ..

రామసముద్రం : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతీ దిగువబొంపల్లికి చెందిన వెంకటనరసింహులు కుమారుడు సురేంద్ర (25) గత వారం క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరుపతి లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులను రెగ్యులరైజ్ చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్


మదనపల్లె : రాష్ట్రంలో థర్డ్‌పార్టీ విధానంలో విద్యుత్‌శాఖలో పని చేస్తున్న 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలని ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోషియేషన్–3045 రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిస్కం, ట్రాన్స్‌కో, జెన్కోలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో కాంట్రాక్టు కార్మికులను అక్కడి ప్రభుత్వాలు రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాయని అన్నారు. దీనికి సంబంధించి వివిధ సందర్భాల్లో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వివాదాల పరిష్కార చట్టం శాశ్వత అవసరాల పనుల్లో కాంట్రాక్టు విధానం కొనసాగించరాదని స్పష్టంగా చెబుతోందన్నారు. ఈ విషయంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు హామీలు ఇచ్చినప్పటికి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం జరిగేలా రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సమావేశంలో డివిజన్ల అధ్యక్షులు యశ్వంత్, భాస్కర, కళ్యాణ్, రాజుకుమార్, ఎం,చంద్ర, గంగాధర్, వేణు, సాంబ, కిరణ్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర సెక్రటరీ పి. మాధవిలత

పీలేరురూరల్ : మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని ఆ పాఠశాలల రాష్ట్ర సెక్రటరీ పి. మాధవీలత అన్నారు. శుక్రవారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతులుపై ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముఖా ముఖి మాట్లాడుతూ విద్యార్థినులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలన్నారు. గత ఏడాది పదో తరగతి ఫలితాలు బాగా వచ్చాయని అభినందించారు. ఈ ఏడాది కూడా ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధారాణి, ఉపాధ్యాయులు పుష్పలత, సునీత, కవిత, శోభారాణి, రేవతి, అనీషా, సపూరా, విద్యార్థినులు పాల్గొన్నారు.

జిల్లా కోసం అన్నమయ్యకు వినతిపత్రం


అన్నమయ్య విగ్రహం వద్ద జిల్లా సాధన సమితి నేతలు

రాజంపేట : రాజంపేటను జిల్లా చేయాలంటూ జిల్లా సాధనసమితి జెఏసీ ఆధ్వర్యంలో పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులకు వినతిపత్రం అందజేసే విధంగా వినూత్న నిరసన శుక్రవారం చేపట్టారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న జిల్లా కోసం ఉద్యమంను బలోపేత దిశగా తీసుకెళతామని జెఏసీనేతలు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందుగా రాజంపేటకు వచ్చిన సందర్భంగా చేసిన జిల్లా ప్రకటన వాగ్దానంను అమలుచేయాల్సిన బాధ్యత ఆయనకు ఉందన్నారు. మెడికల్ కాలేజీ ఇస్తాను, అన్నమయ్య జలాశయాన్ని నిర్మితం చేస్తామన్న హామీలను ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. రాజంపేటకు వస్తున్న ముఖ్యమంత్రికి మరోసారి జిల్లా ప్రకటన అంశాన్ని గుర్తుచేస్తామన్నారు. కార్యక్రమంలో జెఏసీ నేతలు పూలభాస్కర్, ఉద్దండం సుబ్రమణ్యం, పోకల ప్రభాకర్,ఆస్లాంషేక్, న్యాయవాది నాసరుద్దీన్, కత్తి సుబ్బరాయుడు, అబుబకర్, కరీం, అదృష్టదీపుడు, మోహన్, నారా శివకుమార్ నాయుడు,బుజ్జి, రామచంద్రరాజు, జయచంద్ర, మహదేవయ్య, టీచర్ రమణనాయుడు పాల్గొన్నారు.

జిల్లా కోసం పోస్టుకార్డుల ఉద్యమం..

రాజంపేటను జిల్లా చేయాలని శుక్రవారం రాజంపేట పోస్టుకార్డుల ఉద్యమంను చేపట్టారు. 4వేల కార్డులను సీఎం, డిప్యూటీ సీఎం, డిలీమిటేషన్ కమిటీ మంత్రులకు పంపారు. రాజంపేట ప్రధాన తపాలాకార్యాలయం పోస్టల్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణకు పోస్టుకార్డులను అందజేశారు. కార్యక్రమంలో జెఏసీ కమిటి కన్వీనరు లక్ష్మీనారాయణ, ఏపీరోడ్డు డెవలప్‌మెంట్ మాజీ డైరక్టరు గండికోట గుల్జార్‌బాష,,ప్రైవేటు పాఠశాల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌నాయుడు, కమిటి నేతలు బాసినేని వెంకటేశ్వర్ల నాయుడు, మాజీ కౌన్సిలర్ మీసాల వెంకటసుబ్బయ్య, న్యాయవాది నాసరుద్దీన్, రమేష్‌నాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుర్నూతల సర్పంచ్ రమణయ్యపై హత్యాయత్నానికి కుట్ర

- లక్కిరెడ్డిపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- రక్షణ కల్పించాలని సీఐకి వినతి


గాదిముతుక రమణయ్య

లక్కిరెడ్డిపల్లి : గాదిముతుక రమణయ్య లక్కిరెడ్డిపల్లి మండలం, కుర్నూతల గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతున్నాడు. గతంలో ఈయన భార్య గాదిముతుక లక్ష్మీదేవి ఐదేళ్లు సర్పంచ్‌గా కొనసాగారు. ఈయన రెండోసారి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత నాగేశ్వర తనను హతమార్చాలని పదిహేను రోజులుగా కుట్రలు పన్నుతున్నట్లు గ్రామస్తుల ద్వారా సమాచారం అందిందని రమణయ్య లక్కిరెడ్డిపల్లి పోలీసులను ఫిర్యాదు చేశారు. నాగేశ్వర (టీడీపీ నేత) తనవద్ద పిడిబాకును పట్టుకుని గ్రామంలో కొంతమంది వ్యక్తుల దగ్గర సర్పంచ్ రమణయ్యను చంపేస్తానని అన్నట్లు స్థానికులు తెలిపారని పేర్కొన్నారు. దీంతో శుక్రవారం సాయంత్రం రమణయ్య లక్కిరెడ్డిపల్లి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ రవీంద్రబాబుకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఎస్ఐ రవీంద్రబాబు నాగేశ్వరతో పాటు మరో వ్యక్తిని పిలిపించి రెండు గంటల పాటు స్టేషన్‌లో కూర్చోపెట్టారని సర్పంచ్ తెలిపారు. వారిపై కేసు పెట్టకుండా ఇంటికి పంపించేశారని అన్నారు. తనకు, తన కుటుంబానికి నాగేశ్వర ద్వారా ప్రాణహాని ఉందని, లక్కిరెడ్డిపల్లి పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. ఈ విషయమై లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డిని ఫోన్ ద్వారా వివరణ కోరగా సర్పంచ్ రమణయ్య ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఇందులో ఎవరి పాత్ర ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. నాగేశ్వరను కూడా పిలిపించి విచారణ చేపట్టామని సీఐ తెలిపారు.

నాందేడ్–ధర్మవరం రైలు రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తెలంగాణాలోని కామారెడ్డిలో భారీ వర్షాల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. అందులో 07189, 07190 నాందేడ్–ధర్మవరం , ధర్మవరం–నాందేడ్ మీదుగా నడుస్తున్న రైలును ఈనెల 29, 30 తేదీల్లో రద్దుచేసినట్లు కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు.

కాచిగూడ–తిరుపతి మధ్య ప్రత్యేక రైలు :
ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ–తిరుపతి–కాచిగూడ మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 02793 నెంబరుగల తిరుపతి–కాచిగూడ మధ్య నడుపుతున్నారు. ఈ రైలు శనివారం రాత్రి 9.10 గంటలకు తిరుపతిలో బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, తాడిపత్రి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాదిగిరి, సేలం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాదు జంక్షన్ మీదుగా కాచిగూడకు ఉదయం 11 గంటలకు చేరుతుందన్నారు.

ఆటో చోరీకి పాల్పడిన 24 గంటల్లోనే దొంగ అరెస్ట్

కడప అర్బన్ : ఆటో చోరీకి పాల్పడిన కడప నగరం ఎన్జీవో కాలనీ చెందిన తుమ్మలూరు అనిల్ కుమార్‌ను 24 గంటల్లోపే అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి లక్ష రూపాయల విలువైన ఆటో స్వాధీనం చేసుకున్నట్లు కడప చిన్న చౌక్ సీఐ జి. ఓబులేసు తెలిపారు. నిందితుడిపై గతంలో 7 క్రిమినల్ కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదయినట్లు తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను తెలియజేశారు. చిన్నచౌక్ , రైల్వేకోడూరు, తిరుపతి వెస్ట్ ,తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లలో ఆటో దొంగతనాలుకు పాల్పడగా కేసులు నమోదు చేశారన్నారు. చెన్నూరు కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా అతడు పలు కేసులలో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చిన్నచౌక్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వరరెడ్డి రవికుమార్ సిబ్బందితో కలసి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించిన తర్వాత నిందితుడిని గుర్తించామన్నారు. శుక్రవారం తాడిపత్రి–తిరుపతి బైపాస్ రోడ్డులోని చలమారెడ్డిపల్లి క్రాస్ రోడ్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసును విజయవంతంగా 24 గంటల్లోపే ఛేదించిన సీఐ, ఎస్ఐలతో పాటు హెడ్ కానిస్టేబుల్స్ వేణుగోపాల్, శివకుమార్, కానిస్టేబుళ్లు ఖాదర్ హుస్సేన్, ప్రదీప్ కుమార్, సుధాకర్ యాదవ్, మాధవరెడ్డిలను కడప డీఎస్పీ అభినందించారన్నారు. రివార్డుల కోసం సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు.


నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

అన్నమయ్య జిల్లా వద్దు.. బ్రహ్మంగారి జిల్లా ముద్దు



బద్వేలులో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు, మాట్లాడుతున్న ఎస్.విశ్వనాథరెడ్డి

- బ్రహ్మంగారి జిల్లా కావాలంటూ ప్రజాసంఘాల నిరసన
- బద్వేలు నాలుగు రోడ్లు కూడలలో మానవహారం
- జిల్లా సాధన సమితికి సంఘీభావం తెలిపిన విశ్వనాథరెడ్డి

బద్వేలు : రాజంపేటను జిల్లాగా చేసి అందులో బద్వేలు నియోజకవర్గాన్ని కలుపుతామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో అదే రోజు నుంచి బద్వేలు నియోజకవర్గంలో నిరసన జ్వాలలు రగులు కున్నాయి. ప్రతి రోజూ ఏదో ఒక సంఘం బద్వేలును కడప జిల్లాలోనే ఉంచాలని రాజంపేట వద్దని నిరసన రాగాలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో బద్వేలును జిల్లా చేయాలని అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా జరిగిన నిరసన కార్యక్రమానికి బద్వేలు పట్టణ ప్రజలే కాకుండా గ్రామాలని నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

ఉంటే వైఎస్ఆర్ కడప జిల్లా..లేకుంటే బ్రహ్మంగారి పేరున జిల్లా

నాలుగు రోడ్ల కూడలిలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి వైఎస్ఆర్ సీపీ బద్వేలు నియోజకవర్గ అదనపు కార్యదర్శి నల్లేరు విశ్వనాథరెడ్డి తన సంఘీభావాన్ని తెలియజేశారు.ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కడప జిల్లాతో దశాబ్దాల కాలం నుంచి బద్వేలు నియోజక వర్గానికి విడదీయరాని బంధం ఉందని, దానిని కాదని నూతనంగా ఏర్పాటు చేస్తున్న రాజంపేట జిల్లాలో బద్వేలు నియోజక వర్గాన్ని కలుపుతామనడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు ఆలోచనలు కూటమి ప్రభుత్వం మాను కోవాలని హితవు పలికారు. ఒకవేళ తప్పదని బద్వేలును వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి విడదీయాలని అనుకుంటే బ్రహ్మంగారి మఠం లో కొలువైన వీరబ్రంహేమ్మస్వామి పేరుతో బద్వేలు నియోజక వర్గాన్ని జిల్లా కేంద్రం చేయాలన్నారు. అందుకు బద్వేలు పట్టణానికి అన్ని రకాల బౌగోళిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయులు, పెన్షనర్ల విభాగం మేధావులు, బీసీ సాధన సమితి, దళిత సాధన సమితి, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతోనే ఉన్నత స్థాయి

– జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, సమస్యకు పరిష్కారం చూపే వినూత్న ఆలోచనలు మిమ్మలను ఉన్నత స్థాయిలో నిలుపుతాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 'మోటివేషనల్ టాక్ ఆన్ కెరీర్‌పై అవగాహన సదస్సు విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని అన్నమాచార్య సేన హాల్లో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ వి బ్రహ్మారెడ్డి కీలక ఉపన్యాసం చేశారు. నేటితరం యువత సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారని గుర్తుచేస్తూ కెరీర్‌లో సక్సెస్ కావాలంటే మాట్లాడడం నేర్చుకోవాలన్నారు ముఖ్యంగా పుస్తకాలు చదవడం అలవాటుగా మారితే ఒక కొత్త లోకం చూసినట్లు ఉంటుందన్నారు. మంచి సినిమాలు చూడాలని, అందులోని విలువైన విషయాన్ని జీవితానికి ఉపయోగపడే వాటిని తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని, ఉద్వేగాలు, ఉద్రేకాలకు దూరంగా ఉండాలన్నారు. అతిగా ఆలోచించడం మానివేయాలని సూచించారు. ఇతరులకు ఇబ్బంది లేకుండా స్వతంత్రంగా జీవించడం అలవర్చుకోవాలని తెలిపారు. గౌతమ బుద్ధుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వ్యక్తిగత జీవితం, కుటుంబం, సామాజిక జీవితాలు, వృత్తి, అభిరుచులు, ఉద్యమాలుకు అవసరమైన ఉమ్మడి లక్షణాల పట్ల అవగాహన కల్పించారు. ఇతర భాషలను తనలో కలుపుకున్నంత కాలం తెలుగు భాషకు వచ్చిన నష్టమేమీ లేదని మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రస్తావించారు. వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి పద్మ మాట్లాడుతూ నైపుణ్యాలు పొందడంలో గత కాలానికి నేటికీ అనూహ్య మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని సమయపాలన పాటిస్తూ వాటిని సాకారం చేసుకోవాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని తీసుకువచ్చేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. విద్య ,ఆరోగ్యం, మూఢనమ్మకాల పట్ల చైతన్యం చేస్తూ సమాజ రుగ్మతల పట్ల జెవీవీ కొరడా ఝులిపిస్తోందన్నారు. ఎన్ఎస్ఎస్ విశ్వవిద్యాలయ సమన్వయకర్త ఎన్ వెంకట్రామిరెడ్డి సభా సమన్వయం చేస్తూ విద్యార్థుల ప్రయోజనార్థం ఎన్ఎస్ఎస్ ఎన్నో కార్యక్రమాలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ లలిత, ఎం. అనిత, డాక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ ఎస్. రాజగోపాల్ రెడ్డి, డాక్టర్ టి. సురేష్ బాబు, సుధీర్, డాక్టర్ మరియదాస్, మనస్విత, వెంకటరమణ పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్

– ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ

ప్రొద్దుటూరు : జిల్లాలో సోలార్ రూఫ్‌టాప్ వలన గృహ వినియోగదారులు ఉచిత విద్యుత్‌ను పొందవచ్చని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని లక్ష్మీనగర్‌లోని వినియోగదారుల వద్దకు ఎస్ఈ రమణ వెళ్లి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో పెట్టుబడి వ్యయంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన యూనిట్ల వలన కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు తర్వాత సబ్సిడీ ప్రయోజనం మొత్తం మీ బ్యాంక్ ఖాతాకు 30 రోజుల్లోపు జమ అవుతుందన్నారు. ఈ సబ్సిడీ మొత్తం సుమారు రూ.98వేలు ఉంటుందన్నారు. దీని ద్వారా కొంత ఆర్థిక స్థిరత్వం కలుగుతుందని తెలిపారు. రానున్న కాలంలో విద్యుత్ వాహనాల ప్రాధాన్యత అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ప్రొద్దుటూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ కృష్ణమోహన్, జూనియర్ ఇంజనీర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.